RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
మంగళవారం ၊ 25 ၊ ఆగస్టు ၊ 2026

## సెక్యూరిటీ గార్డుల సమస్యలు పరిష్కరించాలి

**- సింగరేణి యాజమాన్యానికి హెచ్ఎంఎస్ మెమోరాండం**



**కొత్తగూడెం, ఆగస్టు 24 (తెలంగాణ వాణి):**
సింగరేణి సెక్యూరిటీ గార్డులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ హెచ్ఎంఎస్ యూనియన్ నాయకులు సోమవారం సింగరేణి యాజమాన్యానికి మెమోరాండం సమర్పించారు. రాత్రి గస్తీ సమయంలో దొంగతనాల ముఠాలను ఎదుర్కొనే సెక్యూరిటీ గార్డుల రక్షణ కోసం అవసరమైన ప్రాంతాల్లో ఆర్మ్‌డ్ గార్డులను నియమించాలని, యూనిఫాం, ఫైబర్ లాఠీలు, టార్చ్‌లైట్లు, రైన్‌కోట్లు, చలి కోట్లు అందించాలని కోరారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయడంతో పాటు 'ఎన్‌మైనస్ వన్' విధానాన్ని తొలగించాలని, పెండింగ్‌లో ఉన్న టీఏ, డీఏ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. మెయిన్ గేట్ల వద్ద షెడ్లను విస్తరించాలని, ప్రధాన విభాగాల్లో పర్మినెంట్ గార్డులను నియమించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి సెక్యూరిటీ సిబ్బందికి మౌలిక సదుపాయాలు కల్పించాలని యాజమాన్యాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ వైస్ ప్రెసిడెంట్ అశోక్ కుమార్, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రెటరీ తోట రవి, మెయిన్ హాస్పిటల్ ఫిట్ సెక్రెటరీ కిరణ్ కుమార్, కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, బ్రాంచ్ సెక్రెటరీ ఆసిఫ్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల హక్కులు, అభివృద్ధిపై జాతీయ ఎస్సీ/ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు

**రూ.10 కోట్ల రహదారి పనులపై నాణ్యతా విచారణ జరపాలి: సర్పంచ్ లావుడ్యా పూర్ణ**



**లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 24,(తెలంగాణ వాణి)**



రేగళ్ల రెవెన్యూ పరిధిలోని గిరిజనుల సమ స్యలను పరిష్కరించాలని కోరుతూ పెద్దతండా గ్రామ సర్పంచ్ లావుడ్యా పూర్ణ జాతీయ ఎస్సీ/ ఎస్టీ కమిషనర్ జాటోత్ హుస్సేన్ నాయక్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రేగళ్ల -కరకవాగు రహదారి నిర్మాణ పనుల నాణ్యతపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. సుమారు రూ.10 కోట్లతో చేపడుతున్న రహదారి పనుల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణ సామగ్రి వినియోగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని, ఎస్టిమేట్, బీఓక్యూ, మెటీరియల్ టెస్ట్ రిపోర్టులు, క్వాలిటీ కంట్రోల్ రికార్డులను పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన గిరిజన రైతులకు అటవీ హక్కుల చట్టం ప్రకారం హక్కు పత్రాలు మంజూరు చేయాలని, ఎస్సీ కాలనీలు, ఎస్టీ తండాల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు వంటి మౌలిక వసతులను సమానంగా కల్పించాలని కోరారు. అలాగే కేటీపీఎస్, నవభారత్ సంస్థల సీఎస్ఆర్ నిధులను గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, ఉపాధి, నైపుణ్య శిక్షణ, తాగునీరు, మౌలిక వసతుల అభివృద్ధికి వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. గిరిజనుల హక్కులు, అభివృద్ధి కోసం నిరంతరంకృషి చేస్తానని సర్పంచ్ లావుడ్యాపూర్ణ తెలిపారు.

## కొత్తగూడెం ఏరియాలో సామాజిక చైతన్య నాటకోత్సవాలు

**25న 'సంఘం శరణం గచ్ఛామి'.. 26న 'సత్యశోధన' ప్రదర్శన**

**కొత్తగూడెం, ఆగస్టు 24 (తెలంగాణ వాణి):**




సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సహకారంతో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ, హైదరాబాద్ ఆధ్వర్యంలో కొత్తగూడెం ఏరియాలో రెండు రోజుల పాటు సామాజిక చైతన్య నాటకోత్సవాలు నిర్వహించనున్నట్లు ఏరియా జీఎం సీహెచ్. వెంకటరమణ తెలిపారు. నెల 25న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవితం, ఆశయాల ఆధారంగా 'సంఘం శరణం గచ్ఛామి', 26న మహాత్మా జ్యోతిరావు ఫూలే, సావిత్రిబాయి ఫూలే దంపతుల జీవితం, ఆశయాల ఆధారంగా 'సత్యశోధన' నాటకాలను ప్రదర్శించనున్నారు. రెండు నాటకాలు సాయంత్రం 6.30 గంటలకు కొత్తగూడెం గౌతంపూర్ కమ్యూనిటీ హాల్‌లో జరుగుతాయి. సామాజిక సంస్కర్తల జీవితాలు, ఆశయాలను ప్రజలకు పరిచయం చేసే ఈ ప్రదర్శనల్లో ఆకట్టుకునే వేదిక, సన్నివేశాలు, కళాకారుల ప్రతిభ ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని జీఎం తెలిపారు. సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, ప్రజలు, కళాభిమానులు, యువత అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

## నేడు నిజామాబాద్‌లో గవర్నర్ పర్యటన

**ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, సీపీ**





**నిజామాబాద్, ఆగస్టు 24 (తెలంగాణ వాణి):**
రాష్ట్ర గవర్నర్ సీ.హెచ్. శివ ప్రతాప్ శుక్లా మంగళవారం నిజామాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10.20 గంటలకు నిజామాబాద్ చేరుకోనున్న గవర్నర్.. 11 గంటలకు భూమారెడ్డి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించే 'నషా ముక్త భారత్ అభియాన్' అవగాహన కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 12.15 గంటలకు జాతీయ పసుపు బోర్డు కార్యాలయంలో 'సునహరీ మిట్టీ అభియాన్' కార్యక్రమంలో పాల్గొని పసుపు రైతులతో సమావేశమవుతారు. అనంతరం డిచ్‌పల్లి మండలం బర్దిపూర్-ధర్మారం శివారులోని పీహెచ్ఆర్ కన్వెన్షన్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. గవర్నర్ పర్యటన నేపథ్యంలో కలెక్టర్ భవేష్ మిశ్రా, పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య సోమవారం ఆయా ప్రాంతాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. పర్యటనకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య బృందాలు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్య ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

## ఓటర్ల జాబితా సవరణపై కాంగ్రెస్ శ్రేణులకు శిక్షణ



**- 25న ఫేజ్-2 ట్రైనింగ్ క్యాంప్**

**పాల్వంచ, ఆగస్టు 24 (తెలంగాణ వాణి):**
ఓటర్ల జాబితా సవరణలో భాగంగా ఈ నెల 25న కొత్తగూడెం విద్యానగర్ కాలనీలోని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో నిర్వహించే ఫేజ్-2 శిక్షణ కార్యక్రమానికి కాంగ్రెస్ శ్రేణులు విధిగా హాజరు కావాలని డీసీఎంఎస్ మాజీ చైర్మన్, పాల్వంచ సొసైటీ అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావు సూచించారు. సోమవారం పొంగులేటి క్యాంపు కార్యాలయంలో పాల్వంచ మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీకి చెందిన బీఎల్ఏలు, సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమావేశంలో పీసీసీ సీనియర్ ఇన్‌చార్జి, కో-ఆర్డినేటర్ ఎం. లింగోజితో కలిసి కొత్వాల ఓటర్ల జాబితా సవరణపై దిశానిర్దేశం చేశారు. అనంతరం బీఎల్ఏలు, సూపర్‌వైజర్లకు నూతన ఓటరు జాబితాలను పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ ఫేజ్-2లో బీఎల్ఏలు కీలకంగా వ్యవహరించాలని,



అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు నమోదు, జాబితాలో తప్పుల సవరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ నెల 25న జరిగే శిక్షణ కార్యక్రమంలో సంబంధిత నాయకులు, బీఎల్ఏలు, సూపర్‌వైజర్లు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చీకటి కార్తీక్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పెద్దబాబు, పాల్వంచ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గంగిరెడ్డి భువన సుందర్‌రెడ్డి, బీఎల్ఏలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## గుండాల ఏకలవ్య పాఠశాల ఘటనపై విచారణ జరపాలి



**- ప్రభుత్వ ఉద్యోగి చెంచు రామకృష్ణపై చర్యలు తీసుకోవాలి: జేఏసీ**

**కొత్తగూడెం, ఆగస్టు 24 (తెలంగాణ వాణి):**
గుండాల మండలంలోని ఏకలవ్య పాఠశాలలో బంజారా విద్యార్థులు, ఉపాధ్యాయుల పట్ల జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బంజారా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం జూలూరుపాడుకు వచ్చిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్‌ను జేఏసీ చైర్మన్ బానోత్ వీరు నాయక్ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వీరు నాయక్ మాట్లాడుతూ పాఠశాలలో బంజారా విద్యార్థులు, ఉపాధ్యాయులు నిర్వహించిన తీజ్ ఉత్సవాలను ప్రభుత్వ ఉద్యోగి చెంచు రామకృష్ణ, మరికొందరు అడ్డుకుని ఘర్షణ వాతావరణం సృష్టించారని ఆరోపించారు. ఈ ఘటనతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళనకు గురయ్యారని, పూర్తి విచారణ లేకుండా బంజారా ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవడం సరికాదని అన్నారు. తీజ్ వంటి సాంప్రదాయ వేడుకలను నిర్వహించుకునే హక్కు ప్రతి వర్గానికీ ఉందని పేర్కొన్నారు. ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తేలితే చెంచు రామకృష్ణపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడిని కోరారు. కార్యక్రమంలో జేఏసీ వైస్ చైర్మన్ ధరావత్ కాన్షీరామ్, ట్రెజరర్ బానోత్ రమేష్, జిల్లా నాయకులు జాటోత్ భరత్, చందర్, మాళోత్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## అఖిల భారత యాదవ మహాసభ పట్టణ యువజన కమిటీ ఎంపిక



**కొత్తగూడెం, ఆగస్టు 24, (తెలంగాణ వాణి)**
అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో కొత్తగూడెం పట్టణ యువజన కమిటీని యాదవ పెద్దల సమక్షంలో సమిష్టిగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు యాదవ్, కొత్తగూడెం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వేల్పుల దామోదర్ యాదవ్ హాజరై నూతన కమిటీ సభ్యులను అభినందించారు. యాదవ యువత ఐక్యతతో ముందుకు సాగుతూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని, భవిష్యత్తులో యాదవులకు దిక్సూచిగా నిలవాలని వారు సూచించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు కోదాడ శ్రీనివాస్ యాదవ్, కౌడగాని శ్రీనివాస్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు చిలక రవి యాదవ్, వేల్పుల కుమార్ యాదవ్, అంబుల వేణు యాదవ్, బొమ్మిడి రమాకాంత్ యాదవ్, ఆవాల శ్రీనివాస్ యాదవ్, సకినాల సమ్మయ్య యాదవ్, యువత నాయకులు బొమ్మిడి శ్రీకాంత్ యాదవ్, జడల నాని యాదవ్ పాల్గొన్నారు.



## బీజేపీ లేబర్‌సెల్ కో కన్వీనర్‌గా రాజేష్ నియామకం



**కొత్తగూడెం (తెలంగాణ వాణి)**
భారతీయ జనతా పార్టీ లేబర్ సెల్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కో కన్వీనర్‌గా సబ్బని రాజేష్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు లేబర్ సెల్ రాష్ట్ర చైర్మన్ అందె శ్రీనివాస్ ఈ నెల 23న నియామక ఉత్తర్వులు జారీ చేశారు. కార్మికుల సంక్షేమం, సమస్యల పరిష్కారం, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఈ సందర్భంగా సూచించారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి రాజేష్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారి హక్కుల సాధనకు కృషి చేస్తానన్నారు. నియామకంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు, కార్మిక సంఘాల ప్రతినిధులు రాజేష్‌కుమార్‌ను అభినందించారు.

## ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలం

**- రేవంత్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి చిత్రపటాలకు పాలాభిషేకం**






**కొత్తగూడెం, ఆగస్టు 24 (తెలంగాణ వాణి):**
ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో ఈ నెల 24న తలపెట్టిన ఆటో బంద్‌ను కార్మిక సంఘాల జేఏసీ విరమించుకుంది. ఈ సందర్భంగా కొత్తగూడెం సూపర్‌బజార్ సెంటర్‌లో కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కనకం సూరిబాబు మాట్లాడుతూ.. ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు, ప్రతి కార్మికుడికి ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సాయం సహా 13 ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను త్వరగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చల్లంగి శ్రీనివాస్, ఎస్డి పాషా, ఎస్.కె మౌలాలి, సంభాని సుధాకర్, హైమద్, రాజు ,రమేష్, నూర్ మహమ్మద్, వీరన్న, కిషోర్, గంగరాజు, వినోద్, గంగులు,, గోపాలకృష్ణ, బి సురేష్, చింతార రమేష్, లచ్చన్న, రాములు, చిన్న, సోడాల శ్రీను, ఓదేలు, వెంకన్న, ముత్యం, చంటి ,వెంకటేష్ ,పవన్, ఉదయ్, మాధవ్ ,నాగేష్, సర్వయ్య, తిరుపతయ్య, నాగరాజు, కృష్ణ, మనోజ్ ,దుర్గ ,నరసింహారావు, గోపి కార్మిక సంఘాల జేఏసీ నాయకులు, ఆటో యూనియన్ నాయకులు, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## అల్పాహారం పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

**- సెంట్రలైజ్డ్ కిచెన్ విధానం రద్దు చేయాలని మధ్యాహ్న భోజన కార్మికుల డిమాండ్**



**ఎల్లారెడ్డి, ఆగస్టు 24 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఎల్లారెడ్డి మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు.
2023, 2024 సంవత్సరాలకు సంబంధించిన తొమ్మిది నెలల పెండింగ్ బిల్లులు, గతంలో నిర్వహించిన అల్పాహార పథకం బకాయిలను తక్షణమే చెల్లించాలని కోరారు. సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని రద్దు చేసి, ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అందించే అల్పాహారాన్ని మధ్యాహ్న భోజన కార్మికులతోనే నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులకు ప్రభుత్వం హామీ ఇచ్చిన రూ.10 వేల గౌరవ వేతనాన్ని అమలు చేయాలని, గ్యాస్, కోడిగుడ్లు, నిత్యావసర సరుకులను ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి విద్యార్థికి మెస్ చార్జీ రూ.25 చెల్లించడంతో పాటు వంట కార్మికులకు గుర్తింపు కార్డులు, ప్రమాద బీమా కల్పించాలని కోరారు. కార్మికులను రాజకీయ కారణాలతో తొలగించరాదని, తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో హేమలత, అంబవ, సువర్ణ, గోపాల్, రజాక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

RNI NO APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
మంగళవారం | 25 | ఆగస్టు | 2026

# భామినిలో ఘనంగా ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం



**తానూరు, ఆగస్టు 24 (తెలంగాణ వాణి ప్రతినిధి):** నిర్మల్ జిల్లా తానూరు మండలం భామిని గ్రామంలో భూమేష్ నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముధోల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జి. విఠల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన గృహాన్ని సందర్శించి భూమేష్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విఠల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి సొంతింటి కల ఎంతో ప్రత్యేకమని, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కల సాకారం కావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో భైంసా మున్సిపల్ చైర్మన్ తుమ్మోళ్ల దత్తు, మార్కెట్ చైర్మన్ ఆనందరావు పటేల్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ రాజన్న, మాజీ జడ్పీటీసీ ఉత్తమ్ బాలేరావు, మాజీ ఆత్మ చైర్మన్ పోతారెడ్డి, సర్పంచులు రోహిదాస్, కృష్ణ, మాజీ ఎంపీటీసీ పోశెట్టి, మౌలాఖాన్ తదితర నాయకులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజావాణి కార్యక్రమం ఆకస్మికం తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్




**జగిత్యాల: ఆగస్టు 24 (తెలంగాణ వాణి ప్రతినిధి)** జగిత్యాల రూరల్ మండలం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. ప్రజల నుండి అందుతున్న వినతులు, ఫిర్యాదుల స్వీకరణ విధానాన్ని పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉదేశ్యం తో గత వారం నుండి మండల స్థాయిలో ప్రజా వాణి కార్యక్రమాలు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును సకాలంలో పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సానుభూతితో విని, శాఖల వారీగా సమన్వయం చేసుకుని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలకు న్యాయం చేకూరేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో రమా దేవి, తహసీల్దార్ హకీమ్, సంబంధిత అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నవరాత్రి ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు



**ఖమ్మం, ఆగస్టు 24 (తెలంగాణ వాణి):** గణేష్ నవరాత్రి ఉత్సవాలు, వినాయక నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌తో కలిసి ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులతో ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ప్రతి గణేష్ మండపానికి ముందస్తు అనుమతి తీసుకోవాలని, రోడ్లను పూర్తిగా ఆక్రమించకుండా మండపాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అక్రమ విద్యుత్ కనెక్షన్లకు తావివ్వరాదన్నారు. అధిక శబ్దంతో ఇబ్బందులు కలగకుండా నిబంధనలు పాటించాలని సూచించారు. నిమజ్జన పాయింట్ల వద్ద తాగునీరు, లైటింగ్, బ్యారికేడ్లు, క్రేన్లు, వైద్య బృందాలు, 108 వాహనాలు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. మున్నేరు నదిలో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున నిమజ్జనానికి అవసరమైన నీటిని ముందుగానే సమకూర్చేందుకు కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. నిమజ్జన రూట్లలో రోడ్డు మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాటు, అడ్డుగా ఉన్న కేబుళ్లు, చెట్ల కొమ్మలను తొలగించే పనులు చేపట్టాలని సూచించారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ అన్ని శాఖలు, ఉత్సవ కమిటీలు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. నిమజ్జనం సందర్భంగా శోభాయాత్ర, రూట్‌మ్యాప్, వాహనాల ఏర్పాట్లను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. నిమజ్జన పాయింట్ల వద్ద సీసీ కెమెరాలు, కంట్రోల్ రూమ్, పారిశుధ్య సిబ్బందిని ఏర్పాటు చేయాలని తెలిపారు. ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ సెప్టెంబర్ 15లోగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని తెలిపారు. అనంతరం గణేష్ మండపాల నిర్వాహకులకు సూచనలతో రూపొందించిన కరపత్రాలను కలెక్టర్, సీపీ ఆవిష్కరించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



# పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసే జీవో 97 రద్దు చేయాలి




**శక్తి పాలసీని వెనక్కి తీసుకోవాలి**

**పాలిటెక్నిక్ విద్యార్థుల నుంచి ఏఐఎస్ఎఫ్ సంతకాల సేకరణ**

**కొత్తగూడెం, ఆగస్టు 24 (తెలంగాణ వాణి):** పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే జీవో నంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి డిమాండ్ చేసింది. రుద్రంపూర్ పాలిటెక్నిక్ కళాశాలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో అనుసంధానం చేయవద్దని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థుల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం, అందుకు విరుద్ధంగా వ్యవస్థను నిర్వీర్యం చేసే చర్యలు చేపట్టడం సరికాదన్నారు. జీవో 97ను రద్దు చేసి, పాలిటెక్నిక్ కళాశాలల అనుసంధాన ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని కోరారు. విద్యార్థులకు నష్టం కలిగించే శక్తి పాలసీని కూడా వెనక్కి తీసుకుని, సాంకేతిక విద్యలో మెరుగైన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని అజిత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్ ఉపాధ్యక్షులు సంజయ్ నాయకురాలు బండి ప్రియాన్సి సలిగంటి జైదీప్ మానస తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ బోర్డు, రూ.12 వేల సాయం తక్షణమే అమలు చేయాలి

**13 డిమాండ్ల పరిష్కారానికి హామీతోనే సమ్మె వాయిదా**

**హామీలు అమలు చేయకుంటే ఉద్యమం తీవ్రతరం: కంచర్ల జమలయ్య**




**కొత్తగూడెం, ఆగస్టు 24 (తెలంగాణ వాణి)** ఆటో, మోటార్ రంగ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఏఐటీయూసీ అనుబంధ ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల జమలయ్య డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకుంటే పాలనను స్తంభింపజేసే స్థాయిలో ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. కొత్తగూడెంలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటో, మోటార్ రంగ కార్మికుల 13 ప్రధాన డిమాండ్లపై హైదరాబాద్‌లో రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌తో కార్మిక సంఘాల జేఏసీ జరిపిన చర్చలు సఫలమయ్యాయని తెలిపారు. ప్రభుత్వం డిమాండ్ల పరిష్కారానికి హామీ ఇవ్వడంతో రాష్ట్రవ్యాప్త సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు చెప్పారు. ఎన్నికల హామీ మేరకు ప్రతి ఆటో కార్మికుడికి ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సాయం, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు, ఆర్టీసీలో ఈవీ ఆటోలను ప్రవేశపెట్టే ప్రతిపాదన ఉపసంహరణకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్నారు. అలాగే పెట్రోల్, గ్యాస్ ధరలకు అనుగుణంగా మీటర్ చార్జీల పెంపు, యాప్ సంస్థల దోపిడీ అరికట్టడం, ప్రమాద బీమా తదితర డిమాండ్లను త్వరగా అమలు చేయాలని కోరారు. హామీల అమలులో జాప్యం చేస్తే భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని జమలయ్య స్పష్టం చేశారు. సమావేశంలో పలువురు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# రెండో విడత ఓటరు నమోదు కార్యక్రమం ప్రారంభం



**అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం**

**పీసీసీ అబ్జర్వర్ లింగోజీ**





**చుంచుపల్లి, ఆగస్టు 24 (తెలంగాణ వాణి):** రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రెండో విడత ఓటరు నమోదు కార్యక్రమాన్ని సోమవారం విద్యానగర్‌లోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో ప్రారంభించారు. లక్ష్మీదేవిపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దేవరగట్ల ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి పీసీసీ అబ్జర్వర్ లింగోజీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కొత్తగూడెం నియోజకవర్గ ఎస్ఐఆర్ ప్రోగ్రాం ఇన్‌చార్జి ఆళ్ల మురళి మాట్లాడుతూ.. ఇటీవల విడుదలైన ముసాయిదా ఓటరు జాబితాలో నియోజకవర్గంలో 43 వేలకు పైగా ఓట్లు తొలగించబడ్డాయని తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయడంతో పాటు, ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని వారు, వలస వెళ్లిన ఓటర్లు, డబుల్ ఎన్‌రోల్‌మెంట్, పేర్లు, చిరునామాల్లో మార్పులు తదితర అంశాలను బీఎల్ఏలు, సూపర్‌వైజర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. లక్ష్మీదేవిపల్లి మండలంలో పోలింగ్ కేంద్రాల సంఖ్య 32 నుంచి 34కు పెరిగిందని తెలిపారు. పీసీసీ అబ్జర్వర్ లింగోజీ మాట్లాడుతూ అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు. ముసాయిదా జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులందరూ ఓటరుగా నమోదయ్యేలా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పెదబాబు, పూనెం శ్రీనివాస్, బి ఎల్ ఏ లు తాటి తిరుమలేశ్, కుంజ సూరిబాబు, దంసలపూడి సరిత, పూసం సత్యనారాయణ, బొల్లం రమేష్, జీడి మహేష్, బండ వెంకటేశ్వర్లు, కొంపెల్లి వీరయ్య, ఉబ్బన రాజు, దయ్యాల సమ్మయ్యలతో పాటు సూపర్వైజర్లు నారబోయిన నరేష్, వార్స నరసింహారావు, సేవ, దేవేందర్, బొల్లి శ్రీను, డి .సురేష్, ఎస్.కె .మహబూబ్, దరావత్ రమేష్, అజ్మీరా మోహన్, కొప్పుల రమణారెడ్డి, పాయం లక్ష్మీనర్సు, బొర్రా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం




**ఎల్లారెడ్డి, ఆగస్టు 24 (తెలంగాణ వాణి ప్రతినిధి):** ఈ నెల 26న జరగనున్న మిలాద్-ఉన్-నబీ పండుగను పురస్కరించుకుని ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్‌లో సోమవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి ఎస్‌డీపీఓ శాంతి కమిటీ సభ్యులకు పండుగను ప్రశాంత వాతావరణంలో, సజావుగా నిర్వహించేందుకు పలు సూచనలు, సలహాలు అందించారు. పండుగ సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అందరూ పోలీసులకు సహకరించాలని సూచించారు. సమావేశంలో శాంతి కమిటీ సభ్యులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డిలో మెగా జాబ్ మేళా-2026 ప్రారంభం

**7 వేల మందికి పైగా యువత రిజిస్ట్రేషన్**



**ఎల్లారెడ్డి, ఆగస్టు 24 (తెలంగాణ వాణి ప్రతినిధి):** ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆధ్వర్యంలో మదన్ మోహన్ ట్రస్ట్ నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళా--2026 సోమవారం ఘ నంగా ప్రారంభమైంది. ఉద్యోగ అవకాశాల కోసం యువత నుంచి విశేష స్పందన లభించగా, ఇప్పటికే 7 వేల మందికి పైగా యువతీ యువకులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జాబ్ మేళాను ఎమ్మెల్యే మదన్ మోహన్ సందర్శించి వివిధ కంపెనీలు నిర్వహిస్తున్న ఇంటర్వ్యూల ప్రక్రియను పరిశీలించారు. అభ్యర్థులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పడంతో పాటు ఉద్యోగ సాధనకు అవసరమైన సూచనలు అందించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# సాలరీ అకౌంట్ ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలి

**- ఉద్యోగులకు అదనపు కలెక్టర్ శ్రీజ సూచన**




**ఖమ్మం, ఆగస్టు 24 (తెలంగాణ వాణి):** ప్రభుత్వ ఉద్యోగులు తమ సాలరీ బ్యాంక్ అకౌంట్ ద్వారా లభించే బీమా, బ్యాంకింగ్ ప్రయోజనాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ పి. శ్రీజ సూచించారు. సోమవారం ప్రజావాణి అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డితో కలిసి ఆమె పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకులతో కుదుర్చుకున్న ఒప్పందం ద్వారా ఉద్యోగుల సాలరీ అకౌంట్లకు పలు బీమా ప్రయోజనాలు అందుబాటులోకి వచ్చాయని శ్రీజ తెలిపారు. సహజ మరణానికి రూ.10 లక్షలు, ప్రమాదవశాత్తు మరణానికి రూ.కోటి, విమాన ప్రమాదంలో మరణిస్తే రూ.1.60 కోట్ల వరకు బీమా రక్షణ లభిస్తుందని వివరించారు. శాశ్వత పూర్తి వైకల్యానికి రూ.కోటి, పాక్షిక వైకల్యానికి రూ.80 లక్షల వరకు బీమా కవరేజ్ ఉంటుందని తెలిపారు. ఎస్‌బీఐ స్టేట్ గవర్నమెంట్ శాలరీ ప్యాకేజీలో వేతనాన్ని బట్టి రోడియం, ప్లాటినం, డైమండ్, గోల్డ్, సిల్వర్ కేటగిరీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఉన్నత విద్య, బాలిక వివాహానికి రూ.10 లక్షల వరకు ప్రయోజనాలు, లాకర్ ఛార్జీలపై 50 శాతం రాయితీ, ఎస్‌బీఐ ఏటీఎంలలో అపరిమిత ఉచిత లావాదేవీలు తదితర సదుపాయాలు ఉన్నాయని వివరించారు. రూపే డెబిట్ కార్డు ద్వారా అర్హత కలిగిన ఉద్యోగులకు విమానాశ్రయ లాంజ్ సదుపాయం, వార్షిక ఆరోగ్య పరీక్ష, ఇతర రాయితీలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కుటుంబ సభ్యులకు కూడా ప్రత్యేక ఖాతాల ద్వారా పలు ప్రయోజనాలు పొందే అవకాశం ఉందన్నారు.

**సాలరీ అకౌంట్‌గా కొనసాగుతుందో పరిశీలించాలి**

ప్రతి ఉద్యోగి తన ఎస్‌బీఐ ఖాతా ప్రస్తుతం సాలరీ అకౌంట్‌గా కొనసాగుతోందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని శ్రీజ సూచించారు. ఖాతా, బీమా ప్రయోజనాలపై సందేహాలుంటే సంబంధిత బ్యాంకు మేనేజర్లను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ కార్యాలయాల సిబ్బందికి సాలరీ ప్యాకేజీ ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ అధికారులు రామ్ బరణ్, రవి ప్రసాద్, ఇబ్రహీం, గౌతమి, సునీతతో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## మత్తు పదార్థాలు ఉంటే జాగిలాలకు చిక్కినట్టే

**గంజాయిపై ప్రజలకు పోలీసుల అవగాహన**





**టేకులపల్లి, ఆగస్టు 24 (తెలంగాణ వాణి):**
గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు టేకులపల్లి పోలీసులు సోమవారం ప్రత్యేక శిక్షణ పొందిన పోలీస్ జాగిలాలతో విస్తృత తనిఖీలు నిర్వహించారు.
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు ఇల్లందు డీఎస్పీ వెంకన్నబాబు సూచనలతో టేకులపల్లి సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్సై తిరుపతి ఆధ్వర్యంలో బోడు క్రాస్‌రోడ్ సెంటర్‌లోని దుకాణాలు, కిరాణా, పాన్ షాపులు, నిర్మానుష్య ప్రాంతాలతో పాటు గతంలో గంజాయి కేసుల్లో నిందితుల ఇళ్లలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్సై మాట్లాడుతూ యువత గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగంతో ఆరోగ్యం, భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని, చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని కోరారు. గంజాయి, మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. నిషేధిత మత్తు పదార్థాలను కలిగి ఉన్నా, వినియోగించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో టేకులపల్లి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పర్యవేక్షణ వ్యవస్థ ఉన్నా అక్రమ నిర్మాణాలు ఎలా?

**అక్రమ నిర్మాణాల కట్టడిలో ముగ్గురు కమిషనర్లు విఫలమయ్యారా?**

**అంజయ్యనగర్ ఘటనతోనైనా అధికారుల్లో చలనం వస్తుందా**

**అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్**


జీహెచ్ఎంసీ కమీషనర్


ఎంఎంసీ కమీషనర్


సీఎంసీ కమీషనర్

**హైదరాబాద్, ఆగస్టు 24 (తెలంగాణ వాణి)**
గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నప్పటికీ వాటిపై ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజావాణి కార్యక్రమాల్లో బాధితులు, స్థానికులు ఫిర్యాదులు చేస్తున్నా సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారం కావడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు కమిషనర్ కార్యాలయాల పరిధిలోని జోనల్, డిప్యూటీ కమిషనర్ స్థాయి అధికారులకు ఫిర్యాదులు అందుతున్నప్పటికీ అక్రమ నిర్మాణాల జోరు తగ్గడం లేదని ఆరోపణలు ఉన్నాయి.

**ప్రజావాణి ఫిర్యాదులపై చర్యలెక్కడ?**
అక్రమ నిర్మాణాలకు సంబంధించి ఇప్పటివరకు ఎన్ని ఫిర్యాదులు అందాయి? వాటిపై ఎన్ని తనిఖీలు నిర్వహించారు? ఎన్ని నోటీసులు జారీ చేశారు? ఎన్ని నిర్మాణాలను సీజ్ చేశారు? సీజ్ చేసిన తర్వాత కూడా నిర్మాణాలు కొనసాగిన సందర్భాలు ఎన్ని? ఎన్ని భవనాలను కూల్చివేశారు? ఎన్ని కేసులు నమోదు చేశారు? ఇంకా ఎన్ని ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి? అనే వివరాలను అధికారులు ప్రజలకు వెల్లడించాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి.

**పర్యవేక్షణ వ్యవస్థ ఉన్నా అక్రమ నిర్మాణాలు ఎలా?**
క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి ఇంజనీరింగ్ అధికారులు, ఏసీపీ, డిప్యూటీ కమిషనర్, జోనల్ కమిషనర్ స్థాయి వరకు పర్యవేక్షణ వ్యవస్థ ఉన్నప్పటికీ అక్రమ నిర్మాణాలు కొనసాగుతుండటంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు వచ్చినప్పుడు వాటిని వెంటనే పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ప్రజలు అంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో అధికారుల నిర్లక్ష్యం, అక్రమ నిర్మాణదారులతో కుమ్మక్కు వంటి ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను నిగ్గు తేల్చాలని కోరుతున్నారు.

**పత్రికల్లో కథనాలు వచ్చినా స్పందన కరువు**
అక్రమ నిర్మాణాలపై పత్రికల్లో వరుసగా కథనాలు ప్రచురితమైనప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అక్రమాలనువెలుగులోకితీసుకు వచ్చే వారిపై ఒత్తిళ్లు తీసుకురావడంలేదావారినిఇబ్బందులకు గురి చేస్తున్నారన్న ఆరోపణలుకూడావినిపిస్తున్నాయి. అయితే ఇలాంటి ఆరోపణలపైఅధికారులు స్పష్టత ఇవ్వాల్సినఅవసరం ఉంది.

**ప్రమాదాలు జరిగిన తర్వాతే హడావుడా?**
ప్రమాదాలు జరిగినప్పుడు, కోర్టు ఆదేశాలు వెలువడినప్పుడు లేదా ఉన్నతస్థాయి ఆదేశాలు వచ్చినప్పుడు మాత్రమే అధికారులు తనిఖీలు, కూల్చివేతలు చేపట్టడం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమ నిర్మాణాలు ప్రారంభ దశలోనే గుర్తించి అడ్డుకుంటే ప్రాణనష్టం, ఆస్తి నష్టం నివారించవచ్చని పేర్కొంటున్నారు.

**విజిలెన్స్ నివేదికలపై చర్యలేవి?**
అక్రమ నిర్మాణాలు, అధికారుల నిర్లక్ష్యంపై విజిలెన్స్ విభాగం నిర్వహించిన విచారణలు, సమర్పించిన నివేదికలపై తీసుకున్న చర్యలను కూడా ప్రభుత్వం వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు. నివేదికలు వచ్చినా బాధ్యులపై చర్యలు లేకపోతే అవి కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయన్న అనుమానాలు బలపడతాయని అంటున్నారు.

**కోర్టు కేసులు, స్టే ఉత్తర్వులపై పర్యవేక్షణ అవసరం**
కోర్టు కేసులు, స్టే ఉత్తర్వులు ఉన్న నిర్మాణాల విషయంలో అధికారులు నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తున్నారా? స్టే ఎత్తివేతకు అవసరమైన న్యాయపరమైన చర్యలు తీసుకుంటున్నారా? అనే అంశాలపై కూడా స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. కోర్టు పరిధిలో ఉన్న కేసుల విషయంలో న్యాయ నిపుణుల సూచనల మేరకు చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు.

**ప్రతి ఫిర్యాదుపై గడువుతో చర్యలు తీసుకోవాలి**
అక్రమ నిర్మాణాలపై వచ్చిన ప్రతి ఫిర్యాదును ప్రత్యేకంగా సమీక్షించి, వాస్తవాలను నిర్ధారించి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులపై గడువును నిర్ణయించి పరిష్కరించాలని కోరుతున్నారు. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు ఇకనైనా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమ నిర్మాణాల వెనుక అధికారుల నిర్లక్ష్యం లేదా అవినీతికి సంబంధించిన ఆరోపణలు నిజమైతే బాధ్యులపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.